సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం, 19, ఆగస్టు, 2023



స్వర్ణోత్సవాలపై విస్తృత ప్రచారం

రాజవొమ్మంగిలో అల్లూరి జెడ్పీ హైస్కూల్ స్వర్ణోత్సవాల నిర్వహణపై పూర్వ విద్యార్థులు విస్తృత ప్రచారం నిర్వహించారు. IIలో



ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

మూడు సర్పంచ్‌లు,14 వార్డు సభ్యుల స్థానాలకు శనివారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. IIలో



కూరగాయల సాగుతో అదనపు ఆదాయం IIలో


కూరగాయల సాగుతో మంచి ఆదాయం పొందవచ్చని అధికారులు సూచించారు.

న్యూస్‌రీల్

నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, పాడేరు: సమగ్రశిక్షా ఆధ్వర్యంలో జిల్లాలో నడుస్తున్న కేజీబీవీలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఈవో, ఇన్‌చార్జి ఏపీడీ సలీంబాషా ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ మండలాల్లోని కేజీబీవీల్లో కుక్‌లు, అసిస్టెంట్ కుక్‌లు, డే అండ్ నైట్ వాచ్‌ఉమెన్ ఉద్యోగాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. నెలకు రూ.7 వేల వేతనం ఉంటుందన్నారు. ఈ పోస్టులకుగాను ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వీటిని ఈనెల 21వతేదీ సోమవారం సాయంత్రం 5గంటల లోపు జిల్లా కేంద్రం పాడేరులోని పీఎంఆర్‌సీ భవనంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకునే మహిళలు ఏడవ తరగతి తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



దూసరపాములో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

రాజవొమ్మంగి: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా మండలంలోని దూసరపాము, జడ్డంగి, రాజవొమ్మంగి శివాలయం కొండపైన, కన్నయమ్మపేటలో, లాగరాయి గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దూసరపాములో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ ఉదయ్‌భాస్కర్

రంపచోడవరం: టీడీపీకి చెందిన 20 కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక మండల పరిషత్ ఆవరణలో టీడీపీకి చెందిన సీనియర్ నాయకుడు గుత్తుల వెంకటేశ్వరరావు, అడబాల చిన్ని తదితరులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంపీపీలు బందం శ్రీదేవి, కుంజం మురళీ, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, వైస్‌ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ కారుకోడి పూజ,సచివాలయ మండల కన్వీనర్లు పండా రామకృష్ణదొర, కందుల బాబ్జి పాల్గొన్నారు.

కారడవిలో కాంతిరేఖ

ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో చుట్టూ ఎత్తయిన కొండలు.. జాలు వారే జలపాతాలు.. ఆకట్టుకునే ప్రకృతి సోయగాలు.. వీటి మధ్య విద్యుత్ కాంతిరేఖ మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం. పూర్తి విదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ కేంద్రం గత 68 సంవత్సరాలుగా అవిశ్రాంతంగా వెలుగులు అందిస్తూ శనివారం నాటికి 69వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.



మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం

- 68 ఏళ్లుగా నిరంతర విద్యుత్ ఉత్పత్తి
- పూర్తి విదేశీ పరిజ్ఞానంతో నిర్మాణం
- దేశంలో మొట్టమొదటి విద్యుత్ కేంద్రం
- నేడు మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం 69వ ఆవిర్భావ దినోత్సవం

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం భారత దేశానికి స్వాతంత్య్రం రాకముందే నిర్మాణానికి ఆయువు పోసుకుంది. 1931లో అప్పటి బ్రిటీషు శాస్త్రవేత్త హెన్రి హెవర్డు మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న సమయంలో ఈ విద్యుత్ కేంద్రం సమగ్ర రిపోర్టును తయారు చేయించారు. 1941 నుంచి 1943 వరకు వరస సర్వేలు చేసి అనుకూలమైన ప్రదేశాన్ని గుర్తించారు. 1946లో విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని రూ.18కోట్లతో చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం తరువాత ఈ విద్యుత్ కేంద్రం ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో కొనసాగుతోంది. ఇక్కడయ్యే ఉత్పత్తిలో ఆంధ్రా 70 శాతం, ఒడిశా 30శాతం చొప్పున విద్యుత్‌ను వినియోగించుకోవాలని ఇరు రాష్ట్రాలు నిర్ణయించుకున్నారు. ఏడేళ్ల క్రితం ఈ ఒప్పందాన్ని ఇరు రాష్ట్రాలు సమానాంగా వినియోగించుకోవాలని సవరించాయి.

జోలాపుట్టు, డుడుమ ఆధారం

మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి ఇరు రాష్ట్రాల సరిహద్దులోని డుడుమ, జోలాపుట్టు జలాశయాలు ప్రధాన ఆధారం. డుడుమ జలాశయ సామర్థ్యం 2590 అడుగులు, జోలాపుట్టు జలాశయ సామర్థ్యం 2750 అడుగులు. ఏడాది పొడవునా ఈ రెండింటిలో నీరు నిల్వ చేస్తారు. డుడుమ కెనాల్ ద్వారా విడుదల చేస్తుంటారు.

- విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలైన నీటితో మొదట అప్పర్ సీలేరు వద్ద 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అక్కడ నుంచి ఆంధ్ర భాగస్వామ్యం మొదలై డొంకరాయి వద్ద 25 మెగావాట్లు, లోయర్ సీలేరు వద్ద 460 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అనంతరం గోదావరిలో కలుస్తుంది.
- డుడుమ, జోలాపుట్టు జలాశయాలకు మత్స్యగెడ్డ నీరే ఆధారం. ఇది పాడేరు డివిజన్ జి. మాడుగుల మండలం గెమ్మెలి నుంచి మొదలై మత్స్యగుండం మీదుగా పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో విస్తరించి ఉంది.

ఆధునికీకరణ దిశగా అడుగులు

ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలు ఈ జల విద్యుత్ కేంద్రం ఆధునికీకరణకు నిర్ణయించాయి. ఇందుకు రూ.500 కోట్లు ఖర్చు కాగా చెరిసగం కేటాయించాలని ఒప్పందం చేసుకున్నాయి.

- ఆధునికీకరణకు చేపట్టాల్సిన పనులకు సంబంధించి నివేదిక తయారీ బాధ్యతను టాటా కన్సల్టెన్సీ కంపెనీకి ఏపీ జెన్‌కో అప్పగించింది. ఇదే కంపెనీకి చెందిన 14 మందితో కూడిన బృందం ఇప్పటికే మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించింది. జనరేటర్లు, టర్బైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు,స్విచ్ యార్డులు, భవనాల స్థితిగతులను పరిశీలించింది. వాటికి ఆయువు (ఎనాలసిస్) పరీక్షలు నిర్వహించింది. దీనిపై నివేదికను ఇరు రాష్ట్రాలకు అందజేసింది. ఆధునికీరణ కార్యరూపం దాల్చితే ఉత్పత్తి సామర్థ్యం 150 మెగా వాట్లకు చేరుతుందని జెన్‌కో అధికార వర్గాలు తెలిపాయి.



విద్యుత్ ఉత్పత్తి చేసే జనరేటర్లు

ప్రత్యేకతలివీ..

- భారతదేశ మొట్టమొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ 1955 ఆగష్టు 19న ఈ కేంద్రాన్ని విశాఖపట్నం నుంచి ప్రారంభించారు.
- విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు మొత్తం 6 జనరేటర్లు ఉన్నాయి. 1,2,3 నంబర్ల జనరేటర్లతో 51 మెగావాట్లు, 4,5,6 నంబర్ల జనరేటర్లతో 69 మెగావాట్ల చొప్పున 120 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతోంది.
- 1,2,3 జనరేటర్లు వెస్టింగ్ హౌస్ అమెరికాకు చెందినవి కాగా 4,5,6 జనరేటర్లు బ్రౌన్‌బోవ జర్మనివికి చెందినవి. టర్బైన్లు, ట్రాన్స్‌పార్మర్లు ఇంగ్లండ్‌కు చెందినవి.



పవర్ యూనిట్ నుంచి విడుదల అవుతున్న నీరు

- 68 సంవత్సరాలుగా ఇక్కడ నిరంతరం విద్యుత్ ఉత్పత్తి జరుగుతూనే ఉంటుంది. అయితే పురాతన యంత్రాలు కావడంతో అప్పుడప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విడిభాగాలు దొరకనందున సొంతంగా తయారు చేసుకోవాల్సి వస్తోంది.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ రవిబాబు



గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన కుంభా రవిబాబు శుక్రవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫుడ్ కోర్టులు, కాఫీ హౌస్‌ల నిర్వహణకు ఈ-వేలం

- వచ్చేనెల 9వ తేదీన నిర్వహణ
- జిల్లా పర్యాటక శాఖ అధికారి దాస్

సాక్షి, పాడేరు: జిల్లాలోని ఫుడ్ కోర్టులు, కాఫీ హౌస్‌ల నిర్వహణకు ఈ–వేలంను వచ్చేనెల 9వతేదీన నిర్వహిస్తామని జిల్లా పర్యాటకశాఖ అధికారి జి.దాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అరకులోవ్యాలీ రిసార్ట్స్‌లో ఐదు ఫుడ్ కోర్టులకు ఒక్కొక్కటి సంవత్సరానికి రూ.1.25 లక్షల చొప్పున ఐదేళ్ల కాలపరిమితికి, అనంతగిరిలోని కాఫీ హౌస్‌కు ఏడాదికి రూ.1.10 లక్షల చొప్పున 15 ఏళ్ల కాలపరిమితికి ఈవేలం నిర్వహిస్తామన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పర్యాటక కేంద్రాల్లో పలు వ్యాపారాలకు ఇప్పటికే టెండర్లు పిలిచినట్టు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వచ్చే నెల ఐదవ తేదీలోగా తమ బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలకు http://tender. apeprocurment.gov.in లేదా www. tourism.ap.gov.in లేదా జాయింట్ మేనేజర్‌ను 9640007182 నంబరులో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- 135 అర్జీల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్పందనతో పాటు జగనన్నకు చెబుదాంకు సంబంధించి ప్రజల నుంచి వస్తున్న వినతులను పరిశీలించి, వెంటనే పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.శుక్రవారం స్థానిక ఐటీడీఏలో నిర్వహించిన స్పందనలో 135 వినతులను కలెక్టర్‌తో పాటు,జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్‌లు స్వీకరించారు.

అధికారులతో సమీక్ష

అన్నిశాఖల అధికారులతో స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్షించారు.ఆన్‌లైన్ చేసిన ప్రజల వినతులను 24గంటల్లో అధికారులు పరిశీలించాలని, సత్వర న్యాయం జరగాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో అంబేద్కర్, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, పలు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు లావణ్యకుమార్, కొండయ్యపడాల్, లీలాకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి నందు, ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్, ఎల్‌డీఎం రవితేజ పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన జేసీ శివశ్రీనివాస్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అర్జీల్లో కొన్ని..

- పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ తులబరంగి గ్రామ సమీపంలోని పారు గెడ్డ పై చెక్‌డ్యామ్ నిర్మించి భూములకు సాగునీరు అందించాలని గ్రామానికి చెందిన ఎం.సుబ్బారావు, సుందరరావు వినతిపత్రం అందజేశారు.
- పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ దూరుపల్లి గ్రామానికి చెందిన బడ్నాయిని వరుణ్‌తేజ్ మూగ పింఛన్ మంజూరు చేయాలని అర్జీ అందజేశాడు.
- జి.కే.వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ మంగళంపాలెంకు చెందిన మర్రి జమ్మి తనకు పక్కా ఇల్లు మంజూరు చేయాలని కోరింది.
- హుకుంపేట మండలం చీకుమద్దెల నుంచి పాడేరు మండలం డల్లాపల్లికి తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని చీకుమద్దెల ఉప సర్పంచ్ ఎం.ఉత్తరన్న, సుబ్బారావు విన్నవించారు.
- పాడేరు మండలం ఎగుమోదాపుట్టు గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని కె.లచ్చన్న, వంజంగి పంచాయతీ వై.సంపాలు గ్రామానికి సీసీరోడ్లు మంజూరు చేయాలని సర్పంచ్ వి.బొంజుబాబు అధికారులను కోరారు.
- జి.మాడుగుల మండలం సొలభం పంచాయతీ నుంచి గడుతూరు పంచాయతీకి వెళ్లే ప్రధాన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలతో పాడైందని, రోడ్డు అభివృద్ధితో పాటు రెండు చోట్ల కల్వర్టులు నిర్మించాలని అదే ప్రాంతానికి చెందిన కిల్లో సుబ్బారావు,కిల్లో జగ్గారావు వినతి పత్రం అందజేశారు.

గ్రూప్-1 విజేతలకు ఘన సత్కారం



ఐటీడీఏలో గ్రూప్-1 విజేతలు చిట్టపులి జీవన, జౌడు వెంకట సత్యకీర్తిని సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు



చిట్టపులి జీవన, జౌడు వెంకట సత్యకీర్తిని పాడేరులోని తన స్వగృహంలో సత్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: విశాఖలోని వేపగుంటలో పాడేరు ఐటీడీఏ చేపట్టిన సివిల్స్ ఉచిత శిక్షణ కార్యక్రమం ద్వారా గ్రూప్–1లో సత్తాచాటి ఉన్నత ఉద్యోగాలు సాధించిన యువతులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ముంచంగిపుట్టు మండలం కిలగాడకు చెందిన చిట్టపులి జీవన డీఎస్పీగా, అనకాపల్లి జిల్లా నాతవరానికి చెందిన జౌడు వెంకట సత్యకీర్తి వైద్యశాఖ అడ్మినిస్ట్రేషన్‌లో సెక్రటరీగా ఉన్నత ఉద్యోగాలు సాధించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలో జరిగిన కార్యక్రమంలో వీరిని కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అభినందించారు. శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వారి తల్లిదండ్రులను అభినందించారు. సివిల్స్ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన 21వ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అధినేత ధరణికి అధికారులు అభినందనలు తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు

ఉన్నత లక్ష్యంతో చదివితే చక్కని ఫలితాలు సాధించవచ్చని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గ్రూప్–1లో సత్తాచాటిన చిట్టపులి జీవన, జౌడు వెంకట సత్యకీర్తిలను ఆయన నివాసంలో శుక్రవారం సత్కరించారు. వాళ్ల తల్లిదండ్రులను అభినందించారు. కేక్ కటింగ్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–1లో సత్తాచాటిన జీవన, వెంకట సత్యకీర్తిలను గిరి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ సహకారంతో అప్పటి ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మంచి ఆశయంతో గిరిజన అభ్యర్థులకు సివిల్స్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, పెదబయలు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కె. సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

గిరి విద్యార్థి లోకానికి గర్వకారణం

గిరి యువతులు చిట్టపులి జీవన,జౌడు వెంకట సత్యకీర్తిలు గ్రూప్–1లో సత్తా చాటడం అభినందనీయమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు.శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని తొలి ప్రయత్నంలోనే ఉన్నత ఉద్యోగాలు సాధించడం గిరిజన విద్యార్థి లోకానికి గర్వకారణమన్నారు.

క్లిక్ క్లిక్..



గిరి జీవన సౌందర్యం

మన్యం ప్రకృతి అందాలకు పుట్టినిల్లు. ఇక్కడ ఎటుచూసినా మనస్సును హత్తుకునే దృశ్యాలు.. కనువిందు చేసే అందాలు.. ఎత్తయిన కొండలు, జాలువారే జలపాతాలు.. ఒంపులు తిరిగే వాగులు.. ఎత్తయిన లోయలు.. వలిసె పూల అందాలు.. ఆటుపోట్ల మధ్య గిరిజనుల జీవనశైలి కనిపిస్తుంది. ఏటా ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు వీటిని తనివితీరా ఆస్వాదించి.. ఆ జ్ఞాపకాలను ఫొటోల రూపంలో భద్రపరచుకుంటుంటారు. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆ దృశ్యాల్లో కొన్ని..

– ముంచంగిపుట్టు/ సాక్షి, పాడేరు



శ్రమైక జీవనం



దీపంలో ఒదిగిన భానుడు



పులిగోరు పువ్వు సోయగం



గిరి బతుకు చిత్రం

నాణ్యత ఆధారంగా బిల్లుల చెల్లింపులు

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ కింద చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటీరియల్ కాంపొనెంట్ కింద చేసిన పనుల నాణ్యతలు తనిఖీ చేసి నివేదించాలని ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో చేసిన పనుల నాణ్యత ఆధారంగానే బిల్లులు చెల్లిస్తామని ఆయన స్పష్టం చేశారు. రూ. 5 లక్షలకు పైబడి చేసిన పనుల నాణ్యతను పరిశీలించి నివేదిస్తే త్వరలోనే బిల్లుల చెల్లింపులకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నరు. ఉపాధి పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెటీరియల్ కాంపొనెంట్ కింద చేపడుతున్న పనులు జాప్యం చేయకుండా వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈలు డీవీఆర్‌ఎం రాజు, వేణుగోపాల్, ఉపాధి హామీ ఏపీడీ గిరిబాబు, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

పాడేరు- శ్రీకాకుళం ఆర్టీసీ సర్వీసు ఏర్పాటు



పాడేరు-శ్రీకాకుళం ఆర్టీసీ బస్సు

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రం పాడేరు నుంచి విజయనగరం మీదుగా శ్రీకాకుళంకు ఆర్టీసీ బస్సు సర్వీసును ఉన్నతాధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సర్వీసుకు సంబంధించి ఇటీవల నిర్వహించిన ట్రయల్ రన్‌లో సర్వీసు ఆశాజనకంగా ఉన్నందున కొనసాగించాలని వారు నిర్ణయించారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీకాకుళం బయలుదేరుతుంది. వి.మాడుగుల, వడ్డాది, చోడవరం , సబ్బవరం, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం నడుస్తుందని, రాత్రి 9 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుందని ఆర్టీసీ అధికారవర్గాలు తెలిపాయి. మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బయలుదేరి ఉదయం 11 గంటలకు పాడేరు చేరుకుంటుందని వారు పేర్కొన్నారు. కొత్త సర్వీసు అందుబాటులోకి రావడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

శౌర్యచక్ర అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

● సీఐ సుధాకర్‌కు ఆత్మీయ అభినందనలు



సీఐ సుధాకర్‌ను సన్మానించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు

సాక్షి, పాడేరు: స్వాతంత్య్ర దినోత్సవం వేడుకల్లో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ముఖ్యమంత్రి శౌర్యచక్ర అవార్డు పొందిన పాడేరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.సుధాకర్‌ను శుక్రవారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఘనంగా సన్మానించారు. పాడేరు సర్కిల్ కార్యాలయానికి ఎమ్మెల్యే పాల్గుణ వెళ్లి సీఐ సుధాకర్‌కు దుశ్శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించి, ఆత్మీయ అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యానారాయణ, పెదబయలు మాజీ ఎంపీపీ చల్లంగి ఉమామహేశ్వరరావు, , వైస్ ఎంపీపీ వంతాల అప్పారావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్, నాయకులున్నారు.

పాఠశాల స్వర్ణోత్సవాలపై విస్తృత ప్రచారం

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలను ఘనంగా జరుపుకుందామని పూర్వ విద్యార్థులు శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని దూసరపాము గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీగా ఇంటింటికి వెళ్లి నవంబర్ 18, 19 తేదీల్లో నిర్వహించే పాఠశాల స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీ ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

● మూడు సర్పంచ్, 14 వార్డు సభ్యుల స్థానాలకు నేడు పోలింగ్
● సీలేరులో 144 సెక్షన్

సాక్షి,పాడేరు: జిల్లాలోని మూడు పంచాయతీ సర్పంచ్‌లు,14 వార్డు స్థానాలకు శనివారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, సామగ్రితో శుక్రవారం మధ్యాహ్నానికి చేరుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

కొన్నిచోట్ల ఏకగ్రీవం

జిల్లాలోని నాలుగు సర్పంచ్ స్థానాలు,58 వార్డు స్థానాలకు నామినేషన్లను స్వీకరించారు. ఈనెల 14వతేదీన నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణలో రంపచోడవరం మండలం ఆకూరు సర్పంచ్ తోపాటు, 44 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. జీకేవీధి మండలం సీలేరు సర్పంచ్ స్థానానికి ముగ్గురు, పెదబయలు మండలం పెదకోడాపల్లి సర్పంచ్ స్థానానికి ఐదుగురు, హుకుంపేట మండలం శోభకోట సర్పంచ్ స్థానానికి నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

చింతపల్లి పంచాయతీలో 4వవార్డు, కుడుముసారి పంచాయతీలో 9, రేవళ్ల పంచాయతీలో 5, పి.మాకవరంలో ఒకటి, బారామోసిలో 3, ఇంజరిలో 4,12, తుమ్మల పంచాయతీలో 6, కొత్తపల్లి పంచాయతీలో ఒకటి ,గూడూరు పంచాయతీలో ఐదు, వెంకటయ్యపాలెం పంచాయతీలో 3, బండపల్లి పంచాయతీలో 8, డీఎస్‌పాలెం పంచాయతీలో 6, దేవీపట్నం పంచాయతీలో 2వ వార్డు సభ్యుల స్థానానికి పోలింగ్ జరగనుంది. ఆయా స్థానాలకు 30 మంది బరిలో ఉన్నారు.

వాడీవేడిగా..

సీలేరు: స్థానిక సర్పంచ్ ఉప ఎన్నిక వాడీవేడిగా జరగనుంది. అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. భారీ బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించేందుకు పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. చింతపల్లి ఏఎస్పీ నేతృత్వంలో జీకేవీధి సీఐ ఆధ్వర్యంలో మూడు స్పెషల్ పార్టీ, ఒక ఏపీఎస్పీ బెటాలియన్, సీఆర్పీఎఫ్, సివిల్ బలగాలు ఇక్కడికి చేరుకున్నాయి. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. స్థానిక ఎంపీపీ పాఠశాలలో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామని రిటర్నింగ్ అధికారి పి.సత్యనారాయణ తెలిపారు. 39 మంది ఎన్నికల సిబ్బంది విధులకు హాజరు కానున్నారు. మొత్తం 2460 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. అనంతరం లెక్కింపు ప్రారంభమవుతుందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.



కొయ్యూరులో పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా పోలింగ్ సిబ్బంది



పెదబయలు బయలుదేరిన పోలింగ్ సిబ్బందితో ఎంపీడీవో పూర్ణయ్య



సీలేరులో పోలీసుల బందోబస్తు

చింతపల్లి మండలంలో..

చింతపల్లి రూరల్: కుడుమసారి, చింతపల్లిలో వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో ఆశాజ్యోతి తెలిపారు.

కొయ్యూరు: రేవళ్లు, పెదమాకవరంలో శనివారం జరగనున్న రెండు వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది తరలివెళ్లారు. రేవళ్లకు పోలింగ్ అధికారిగా నీటిపారుదల శాఖ ఏఈ రామకృష్ణ, పెదమాకవరానికి ఎంఈవో జె. రాంబాబును పోలింగ్ అధికారిగా నియమించారు. ఎంపీడీవో సీతయ్య, ఈవోపీఆర్‌డీ నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

హుకుంపేట: మండలంలోని శోభకోట సర్పంచ్ స్థానానికి భారమాసిలో వార్డు సభ్యులు ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నిక రిటర్నింగ్ అధికారి బాబు ప్రసాద్ తెలిపారు.

పెదబయలు: పెదకోడాపల్లి సర్పంచ్‌కు ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేశామని మండల అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఎల్. పూర్ణయ్య తెలిపారు. సిబ్బంది ఎన్నికల మెటీరియల్‌తో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎన్నిక ధ్రువీకరణ పత్రాల పంపిణీ

ముంచంగిపుట్టు: మండలంలో 12 వార్డు సభ్యుల స్థానాలకు ఒకొక్క నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవం అయ్యాయని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.కృష్ణమూర్తి తెలిపారు. వీరికి ఎన్నిక ధ్రువీకరణ పత్రాలు అందజేశామని ఆయన పేర్కొన్నారు.

అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల అమలు



చట్లవాడలో రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

● రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
● అభివృద్ధి పనులు ప్రారంభం

మారేడుమిల్లి: రాష్ట్రంలో ఒక్క రుపాయి కూడా అవినీతి జరగకుండా అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ బాబు అన్నారు. మండలంలో వారు శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. తొలిత సున్నపాండు గ్రామంలో నూతనంగా ప్రారంభించిన రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద రూ 40 లక్షల వ్యయంతో వైద్యాధికారులు నూతన క్వార్టర్స్ పనులకు శంకుస్థాపన చేశారు. బోదులూరు గ్రామంలో సుమారు రూ.64 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయ, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. అనంతరం బోదులూరు జంక్షన్ నుంచి పొట్లవాడ గ్రామం వరకు రూ.ఐదు కోట్ల వ్యయంతో నిర్మించనున్న పది కిలోమీటర్ల బీటీ రింగ్ రోడ్డు పనులకు చట్లవాడ గ్రామంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలనను అందిచాలనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. గత టీడీపీ హయాంలో లంచాలు లేనిదే ఏ పని జరిగేది కాదని, ప్రస్తుత పాలనలో ఎవరికీ రూపాయి ఇవ్వకుండా ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సేవలు ఉచితంగా అందుతున్నాయన్నారు. చట్లవాడ గ్రామ రహదారి నిర్మాణానికి గతంలో ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్టు స్పష్టం చేశారు. ఎంపీడీవో జయంతి, ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, సర్పంచ్ కొండా జాకబ్, వైస్ సర్పంచ్ వీరబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గంగరాజు, పార్టీ మండల ఇన్‌చార్జి ప్రేమ్, నాయకులు స్మిత్, విక్టర్ , అనిదీప్ కుమార్ సూర్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రగతికి అంతర్గత ప్రేరణ కీలకం



వీసీ ప్రసాదరెడ్డికి పుస్తకాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: అంతర్గత ప్రేరణే వ్యక్తి ప్రగతిలో కీలకమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి సీఏ విద్యార్థుల సదస్సు సంకల్ప్–23ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ యువత కొత్త ఆలోచనలు దేశానికి పెద్ద సంపదగా మారనున్నాయన్నారు. ప్రపంచం శరవేగంగా మార్పులకు లోనవుతోందని, అన్ని రంగాలు తదనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి అసాధారణ ప్రగతిని సాధించిన వ్యక్తులు ఈ రెండు రోజులు స్ఫూర్తి ప్రసంగాలు చేస్తారన్నారు. ఎస్ఎస్ఈబీ చైర్మన్ మంగేష్ పి కినరే మాట్లాడుతూ నూతన కరిక్యులంను అమలు చేస్తున్నామన్నారు. విదేశాల్లో కూడా తమకు 45 శాఖలు ఉన్నాయని, ప్రత్యక్ష శిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీధర్ మప్పల మాట్లాడుతూ సీఏ వృత్తిలో అడుగిడటం విజయానికి ఆరంభంగా మాత్రమే భావించాలన్నారు. సదస్సు సంచాలకుడు డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌కు అవసరమైన బలమైన పునాదులు నిర్మించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్‌సీ, సికాస చైర్మన్ ఆర్.చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ సహనం కలిగి ఉండటం, ఏకాగ్రతతో పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సికాస చైర్మన్ స్వరూప్, వైస్ చైర్మన్ పి.నాని కార్తీక్, విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ ప్రసాద్ కె.పాండ, పెద్ద సంఖ్యలో సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అదనపు ఆదాయం



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

చింతూరు: రైతులు తమ పొలాల గట్లమీద కూరగాయలు, తీగజాతులు పెంచడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశముందని ప్రకృతి వ్యవసాయ విభాగ అధికారులు సూచించారు. స్థానిక రైతుభరోసా కేంద్రం వద్ద వారు వ్యవసాయ సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైన్ షోయింగ్ విధానంలో వరి సాగుచేయాలని, అనంతరం అజొల్లా వేయడం వలన రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. రైతులకు కషాయాలు అందుబాటులో ఉండేలా యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రోత్ ప్రమోటర్ల ద్వారా రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం వారు మండలంలోని తుమ్మల, చింతూరు, పోతనపల్లి, తులసిపాకలో పర్యటించి వరి పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విభాగ అధికారులు ప్రకాష్, హేమసుందర్, తాతారావు, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ గాంధీబాబు పాల్గొన్నారు.

ఎటపాక: కుసుమనపల్లి గ్రామంలో ఏవో రాబిన్ సుదర్శన్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి సాగులో చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలను వివరించారు. వరి పంటలో దీర్ఘకాలిక ప్రయోజనాలైన ఆకు కత్తిరింపును ప్రయోగాత్మకంగా నిర్వహించారు.

1080 లీటర్ల సారా స్వాధీనం

● ఆటో, మూడు స్కూటీల సీజ్
● ఏడుగురి అరెస్ట్, మరో ఐదుగురిపై కేసులు నమోదు
● ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ డీవీజీ రాజు వెల్లడి

పాడేరు రూరల్ : జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎస్ఈబీ సంయుక్తంగా శుక్రవారం వేర్వేరు చోట్ల జరిపిన దాడుల్లో 1080 లీటర్ల సారాను స్వాధీనం చేసుకు ఏడుగురిని అరెస్ట్ చేసి మరో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ వివరాలను శుక్రవారం సాయంత్రం పాడేరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ డీవీజీ రాజు విలేకరులకు తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఒండ్రుగెడ్డ నుంచి ఆటో, స్కూటీల్లో నిషేధిత సారా తరలిస్తున్నారనే సమాచారంతో పాడేరు మండలం చింతలవీధి వద్ద తాము, సిబ్బంది కలిసి నిఘా వేశామన్నారు. అటువైపుగా వస్తున్న ఆటో, స్కూటీలను నిలిపి తనిఖీ చేశామన్నారు. ఆయా వాహనాల్లో తరలిస్తున్న 1060 లీటర్ల సారా పట్టుకున్నామని, మరో కేసులో పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా స్కూటీలో తరలిస్తున్న 20 లీటర్ల సారాతో ఒకరిని అరెస్ట్ చేశామన్నారు. మొత్తంగా 1080 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, ఐదుగురిపై కేసులు నమోదు చేసి ఆటో, మూడు స్కూటీలను సీజ్ చేశామన్నారు. ఎక్కడైన సారా తయారీ, అమ్మకాలు చేపడితే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ దాడుల్లో సీఐ కూర్మారావు, ఎస్ఐ వీర్రాజు, , సిబ్బంది భీమలింగేశ్వరరావు, శ్రీనివాస్, కిరణ్ తదితరులున్నారు.

20న గ్రూప్-1, 2 కోచింగ్ ఎంపికకు ప్రవేశపరీక్ష

తుమ్మపాల: ఏపీ స్టడీ సర్కిల్, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్–1, 2 కోచింగ్ ఎంపికకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 20న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి టి.అజయ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారం పంపామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను ఏపీఎస్‌టీడీసీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. రెండు గంటల పాటు 100 మార్కులకు నిర్వహించే పరీక్షలో ప్రశ్నపత్రం బహుళ ఎంపిక విధానంలో ఉంటుందని పేర్కొన్నారు.

శ్రావణం..శోభాయమానం



కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



సింహవల్లి తాయారు సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు



సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు

● కనకమహాలక్ష్మి సన్నిధిలో శ్రావణలక్ష్మి పూజలు
● వాసవీ మాత సన్నిధిలో 108 గోత్ర రుషి పూజలు
● సింహవల్లీ తాయారుకు లక్ష కుంకుమార్చన

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణం): శ్రావణమాసం తొలి శుక్రవారం అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 8గంటలకు నిర్వహించిన శ్రావణలక్ష్మి పూజల్లో 176 మంది భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందించారు. ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. వేకువజామున మూలవిరాట్‌ను 108 ద్రవ్యాలతో, పండ్ల రసాలతో అభిషేకించారు. పట్టు వస్త్రాలతో అలంకరించిన అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. ఆలయం మండపంలో నిర్వహించిన సామూహిక 108 గోత్ర రుషిపూజల్లో 250మంది మహిళలు పాల్గొన్నారు. దేవాలయ సంఘం అధ్యక్షుడు దినకర్, రామకృష్ణారావు, పురోహితుడు కుమారశర్మ, శివకుమార్, ఆలయ శ్రావణమాస ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ కవిత, కొత్తా సాహిత్య పాల్గొన్నారు.

సింహగిరిపై ప్రత్యేక పూజలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజ చేశారు. ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకు అర్చకులు ఈ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను సింహవల్లీ తాయారు ప్రాంగణంలో సింహాసనంపై కొలువుదీర్చి లక్ష నామాలను పఠిస్తూ, పది ఆవృతులతో కుంకుమ పూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, కుంకుమ అందజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకరి కరి సీతారామాచార్యులు, అర్చకులు గిరి, శ్రీకాంత్, అధ్యాపకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమ్మవారి సన్నిధిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. సాయంత్రం సింహవల్లీ తాయారు సన్నిధిలో సహస్ర నామార్చన చేశారు. అనంతరం సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ మాడ వీధిలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు.